విలేకరులు కావలెను
మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189

# మనవార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 114 | volume: 1, Issue:114 | శనివారం 22 నవంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00

## తెలంగాణ పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



- హైదరాబాద్ పర్యటనలో రాష్ట్రపతికి ఘన స్వాగతం
- బేగంపేట విమానాశ్రయంలో అధికారుల అథిత్య సత్కారం
- రాష్ట్ర, కేంద్ర నేతలు స్వాగతంలో పాల్గొనడం విశేషం

**హైదరాబాద్, 21 నవంబర్** హైదరాబాద్ పర్యటనలో భాగంగా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పలువురు ప్రముఖులు ఆమెకు ఆత్మీయ స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటనలో అధికార వ్యవస్థ మొత్తం అప్రమత్తంగా ఏర్పాట్లు చేసింది.రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ విజయలక్ష్మి తదితర నాయకులు ఉన్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రత్యేక మార్గాల ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం అధికారులు చర్యలు చేపట్టారు.తెలంగాణ పర్యటన సందర్భంగా రాష్ట్రపతి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అభివృద్ధి, విద్య, సామాజిక రంగాలకు సంబంధించిన కార్యక్రమాలు, సమావేశాల్లో ఆమె పాల్గొంటారని సమాచారం అందుతోంది. ఆమె పర్యటనతో నగరంలో అధికారులకే కాక, ప్రజలకూ విశేష ఆసక్తి నెలకొంది.రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమని నేతలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆమె సూచనలు, మార్గనిర్దేశం మరింత ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు. పర్యటన మొత్తం సాఫీగా సాగేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

## సమ్మక్క సారాలమ్మ మహాజాతరకు రాష్ట్రపతికి
# మంత్రి సీతక్క ఆహ్వానం



**హైదరాబాద్, 21 నవంబర్**: వచ్చే జనవరిలో జరగనున్న సమ్మక్క–సారాలమ్మ మహాజాతరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఆదివాసీ జాతరగా గుర్తింపు పొందిన ఈ మహోత్సవానికి రాష్ట్రపతి రాకతో గిరిజన సమాజానికి మహత్తర ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన భారతీయ కళామహోత్సవ్–2025 వేదికగా ఆమె ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, భారత దేశం వైవిధ్యభరిత సంస్కృతి, ప్రజాప్రాంపరలను ప్రతిఫలించే ఈ కళామహోత్సవాన్ని 'భిన్నత్వంలో ఏకత్వం'కు ప్రతీకగా అభివర్ణించారు. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిసి భారతీయ కళా, వంటకాలు, ప్రజా సంప్రదాయాల వైభవాన్ని ఒకే వేదికపై ప్రదర్శించడమే ఈ మహోత్సవం గొప్పతనమని వివరించారు. హైదరాబాద్‌ను "మినీ ఇండియా"గా పిలువడం వెనుక గంగా–జమునా సంస్కృతి నిలిచిన కీలక కారణమని, వైవిధ్యం సవాలు కాదనిఅదే భారత బలం అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒగ్గుకథ, పర్యాని శివతాండవం, బోనాలు, బతుకమ్మ, సమ్మక్క–సారాలమ్మ జాతర వంటి తెలంగాణ సాంస్కృతిక సంపదను ఆమె ప్రస్తావించారు. శాస్త్రీయ కళలతో పాటు గిరిజన, ప్రజా కళలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే గౌరవాన్ని గుర్తుచేశారు.తాను గిరిజన మహిళగా పెరిగిన నేపథ్యాన్ని స్మరించుకుంటూ "అడవి మా జీవనాధారం మాత్రమే కాదు అది మా మతం, మా ఆత్మగౌరవం" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రపతి (ఒడిశా) మరియు గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ (త్రిపుర) ఇద్దరికీ గిరిజన మూలాలు ఉండటంతో తెలంగాణ గిరిజన సంస్కృతితో సహజ బంధం ఉందని అన్నారు. ఈ సందర్భంలో, ములుగు జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్‌కి సీతక్క పలు వినతిపత్రాలు అందించారు. మల్లూరు దేవస్థానం అభివృద్ధికి రూ. 30 కోట్లు, బొగతా జలపాతం అభివృద్ధికి రూ. 50 కోట్లు, జంపన్న వాగు అభివృద్ధికి రూ. 50 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ కళామహోత్సవం ద్వారా భారత దేశం ఒకే స్వరంతో, ఒకే భావంతో ప్రతిధ్వనిస్తోందని మంత్రి సీతక్క పేర్కొంటూ, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రాష్ట్రపతి భవన్, కేంద్ర శాఖలకి అభినందనలు తెలిపారు.

## డెడికేషన్ కమిషన్ నివేదికకు కేబినెట్ ఆమోదం

**హైదరాబాద్, 21 నవంబర్ :** గ్రామ పంచాయతీలు మరియు వార్డుల రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ సమర్పించిన నివేదికకు రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. రిజర్వేషన్లు మొత్తం 50 శాతం మించకుండా ఉండేలా రూపొందించిన ఈ నివేదికను మంత్రుల వద్దకే ఫైల్ పంపించి, సంతకాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ రేపు (శనివారం) రిజర్వేషన్ల విధివిధానాలను ఖరారు చేస్తూ జీవో జారీ చేయనుంది. జీవో వెలువడిన వెంటనే ఎంపీడీవోలు వార్డు సభ్యుల రిజర్వేషన్లు, ఆర్డీవోలు సర్పంచి పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగాలకే కాకుండా మహిళలకు సీట్ల కేటాయింపును రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ విధానంలో నిర్వహించనున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ రేపు, ఎల్లుండి జిల్లాల యంత్రాంగం ద్వారా వేగంగా పూర్తి చేయనున్నారు. రిజర్వేషన్లు ఖరారైన వెంటనే పంచాయతీ ఎన్నికలకు సిద్ధమని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాయనుంది. ఈ నెల 24న హైకోర్టు ముందు ప్రభుత్వం ఎన్నికల సన్నాహకాలు పూర్తి చేస్తున్నట్లు నివేదించి, విచారణ ముగించాలని కోరనుంది. హైకోర్టు అనుమతి లభించిన వెంటనేఅదే రోజు లేదా మరుసటి రోజు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో త్వరలోనే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుందని అధికార వర్గాలు సూచిస్తున్నాయి.

## జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క




**హైదరాబాద్, 21 నవంబర్ 2025** హైదరాబాద్ జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనడం గౌరవంగా ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ విద్యార్థులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో విద్య, నైపుణ్యాలు, ఉపాధి రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. జేఎన్టీయూ వేలాది మంది ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, పరిపాలకులను తయారు చేసి దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. యూనివర్సిటీలోని అన్ని పెండింగ్ సమస్యలకు త్వరిత పరిష్కారం లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందుకోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి వచ్చిన ?800 కోట్ల ప్రతిపాదనలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన ప్రత్యేక సూచనలు చేశారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి, పుస్తకాలు, ల్యాబ్‌లు, పరిశోధన, ఆవిష్కరణలకు మరింత సమయం కేటాయించాలని సూచించారు. ప్రస్తుత స్టార్టప్ యుగంలో తెలంగాణ దేశంలోనే ప్రధాన ఆవిష్కరణ కేంద్రంగా ఎదుగుతోందని, ఈ అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.జేఎన్టీయూ వేదికగా జరిగిన ఈ వేడుకల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా సంస్కరణలు, భవిష్యత్ లక్ష్యాలు, పరిశోధనాభివృద్ధి ప్రణాళికలు ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. విద్యార్థులు పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని ఇంకా బలోపేతం చేయాలని భట్టి విక్రమార్క తెలిపారు.

## స్థానిక, గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యం



**మేడ్చల్ మల్కాజిగిరి, 21 నవంబర్** మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి ఘన సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్ హాజరై ఆత్మీయంగా అభినందనలు తెలియజేశారు. పార్టీ బలోపేతం, ప్రజల్లో బీజేపీ సిద్ధాంతాలను విస్తరించాలన్న లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించబడింది.కార్యకర్తలు 24 గంటలు పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని ఈటెల రాజేందర్ సూచించారు. పదవి అనేది బాధ్యతను పెంచేదని, పార్టీపై నిస్వార్థ నిబద్ధత ఉంటేనే ఆ పదవికి నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇంటింటికి పార్టీని తీసుకెళ్లేలా వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు చేపట్టాలని నూతన కార్యవర్గాన్ని ఆయన కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయడం లక్ష్యంగా కృషి చేయాలని ఈటెల రాజేందర్ పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పైస్థాయి వరకూ సమన్వయం బలోపేతం చేస్తే మాత్రమే ఎన్నికల్లో విజయం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీగా కట్టుబడి ఉండటం, వాటిని నిరంతరం పరిశీలించడం కార్యకర్తల ప్రధాన కర్తవ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.తాను ఎల్లప్పుడూ స్థానికంగా ఉండి పార్టీ కార్యకలాపాలకు అందుబాటులో ఉంటానని, ఎప్పుడైనా పిలిస్తే వెంటనే వచ్చి సహాయం చేయడానికి సిద్ధమని ఈటెల రాజేందర్ తెలిపారు. నూతన కార్యవర్గం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీని అధికారంలోకి తీసుకురావడం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన హితవు పలికారు.

## రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ఎన్ఫోర్స్మెంట్ కఠినతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు



**హైదరాబాద్, 21 నవంబర్:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రవాణా శాఖలో ఎన్ఫోర్స్మెంట్‌ను మరింత కఠినతరం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులు ఆదేశించారు. రవాణా శాఖ ఉన్నతస్థాయి అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక దిశానిర్దేశాలు జారీ చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన 33 జిల్లా స్థాయి బృందాలు, 3 రాష్ట్ర స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్లు నిరంతర తనిఖీలు చేపట్టి రోడ్డు నిబంధనలు అమలు చేయాలని మంత్రి సూచించారు. వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్లు, గ్రామీణ వాహనాలు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎన్ఫోర్స్మెంట్‌ను ప్రజాస్నేహంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గత 10 రోజుల్లో కొత్త బృందాలు రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 4,748 కేసులు నమోదు చేసి, 3,420 వాహనాలను సీజ్ చేసినట్లు మంత్రి వెల్లడించారు. హెవీ వెహికల్ డ్రైవర్లకు పునఃశిక్షణ (రిఫ్రెషర్ ట్రైనింగ్) ఏర్పాటు చేయాలని శాఖను ఆదేశించారు.మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ వాహనాల్లో ఓవర్‌లోడ్ కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. ఓవర్‌లోడ్ చేసిన వాహనాలను వెంటనే సీజ్ చేయాలని, అదే వాహనం రెండోసారి పట్టుబడితే పర్మిట్‌ను రద్దు చేయడంతో పాటు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జనవరిలో జరగనున్న రోడ్డు భద్రతా మాసం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. రవాణా శాఖ సిబ్బంది ప్రాణాలను రక్షించే కార్యక్రమాన్ని అత్యంత ముఖ్యంగా పరిగణించాలంటూ మంత్రి పిలుపునిచ్చారు.

# పల్లె ప్రకృతి వనములో తొలగించిన చెత్త...



**-మన వార్త కథనానికి స్పందన..**

**నార్సింగి నవంబర్ 21( మన వార్త ప్రతినిధి)**మన వార్తా పత్రికలో ప్రచురించడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో పల్లె ప్రకృతి వనం పూర్తిగా చెత్తతో నిండిపోవడంతో, ప్రకృతి వనమా డంపింగ్ యార్డ అనే శీర్షికన ఈనెల 20వ తేదీన మన వార్తా పత్రికలో ప్రచురించడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు, పంచాయతీ కార్యదర్శి మౌనిక డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను డోజర్ మరియు లేబర్ సహకారంతో తొలగింప చేశారు,

# సంస్కృత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**వేములవాడ నవంబర్ 21 (మన వార్త ప్రతినిధి )**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిబడిన సంస్కృత పాఠశాలను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, భోజనం మరియు ఫలహారాల నాణ్యత, ఉపయోగిస్తున్న సామాగ్రి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం, నాణ్యమైన భోజనం మరియు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అల్పాహారం పై ఆది ఆగ్రహం విద్యార్థులకు తయారు చేసిన కిచిడీని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఉమేష్, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓ జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించిన ఎఫ్ ఎల్ ఎన్ టీం సభ్యులు



**చిన్న శంకరంపేటనవంబర్ 21( మన వార్త ప్రతినిధి)**చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాలల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి మెదక్ సి ఎఫ్ ఎస్ టీమ్ సభ్యులు సిరి, సాయికృష్ణ, హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఎఫ్ ఎల్ ఎన్, బేస్ లైన్ టెస్ట్, మిడ్ లైన్ టెస్ట్, టి ఎస్ జి గ్రూపు విద్యార్థులకు మరియు ఎఫ్ ఎల్ ఎస్, వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సాయి రెడ్డి మండల విద్యాధికారి పుష్పవేణి,రిసోర్స్ పర్సన్స్ రాజు, మహేష్, బాల్రాజ్, నరేష్, సతీష్, రమేష్, మహేందర్‌ల తోపాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిబ్బంది సమయపాలన పాటించాలి



**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్...**

**-చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ – 21** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లో సిబ్బంది అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)ని ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు,ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. ప్రసవాల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

# దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**-అనంతరం అన్నదాన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు...**

**ములుగు జిల్లా నవంబర్21 మన వార్త ప్రతినిధి** ములుగు జిల్లా కేంద్రంలో అమ్మ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో క్రీ,,శే,,రెడ్డిమల్ల.సుభద్రాదేవి గారి జ్ఞాపకార్థం నిరుపేద కుటుంబాలకు,వృద్ధ వసయ్యులకు చలికాలం సందర్భంగా అమ్మ ఫౌండేషన్ చైర్మన్ సుభద్ర దుప్పట్లు పంపిణీ చేశారు మరియు అనంతరం,,అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణా రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి-కుంజా.సూర్య హాజరై వారికి దుప్పట్లు పంపిణీ చేసి,అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సీనియర్ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# వసతులు లేని వైద్యశాల...



**-డాక్టర్ గదిలోనే కాన్పులు...**

**మధిర, నవంబర్21( మన వార్త):**మధిర మండలం దెందుకూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో సతమతమవుతున్నారు . గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రధానమైన లక్ష్యంతో 2018లో దెందుకూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు ఏడు సంవత్సరాలు గడుస్తున్న నేటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం లేదు. ఒకవేళ అద్దెకు తీసుకుందామానుకున్నా గ్రామీణ ప్రాంతం కావడంతో అన్ని వసతులుతో కూడిన భవనం లభించడం లేదు. దీంతో వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రెండు గదులతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో పీహెచ్సీ ని ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఉప కేంద్రంలో ఉన్న రెండు గదులు ఉన్నాయి. వాటిలో ఒక గదిలో డాక్టరు వైద్య సేవలు అందిస్తుండగా మరో గదిని రోగులకు ప్రథమ చికిత్స చేసేందుకు ఉపయోగిస్తున్నారు. పురిటి నొప్పులతో ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలు ఆసుపత్రిలో సరైన వసతి లేక అవస్థలు పడుతున్నారు నార్మల్ డెలివరీ చేయాలంటే డాక్టర్లు కూడా అనేక అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో డాక్టర్ గదిలోని అప్పటికప్పుడు బెడ్ ఏర్పాటు చేసి కాన్పులు చేస్తున్నారు. దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు 80 నుండి 100 వరకు రోగులు వస్తున్నారు. వారిలో ఎవరికైనా సీరియస్ గా ఉండి ఇన్ పేషెంట్లుగా ఉంచుకొని వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిలో ఎటువంటి వసతులు లేవు. దీంతో వైద్యులు సీరియస్ కేసులను పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మధిర ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్నారు. గత మూడేళ్లలో దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 121 సాధారణ కాన్పులు చేశారు. దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడు పల్లె దవాఖానాలు ఒక బస్తీ దవాఖాన రెండు సబ్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో ఖమ్మంపాడు సబ్ సెంటర్ శిధిలావస్థకు చేరుకుంది. పేద ప్రజలు అత్యధికంగా వైద్య సేవలు పొందే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు కల్పించాలని, దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత బిల్డింగు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి సాధ్యం



**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్...**

**-వేములవాడ అర్బన్ రూరల్ మండలంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన విప్...**

**వేములవాడ నవంబర్ 21 (మన వార్త )**వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి,వేములవాడ అర్బన్ మండలం రుద్రావరం గ్రామంలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి శ్రీకారంలి మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి సాధ్యం అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి,అర్బన్ మండలంలో రుద్రావరం గ్రామాల్లో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు.. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ కూడా అభివృద్ధి సంక్షేమం ఎక్కడ కూడా ఆపలేదని పేరుకొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. స్వంత ఇంటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, జిల్లాలో నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఇందిరా మహిళా చీరల ఉత్పత్తి ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సాధికారతకు ఉపయోగపడుతుందని,రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన మహిళలకు అందజేసే చీరలు జిల్లాలో ఉత్పత్తి కావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఎస్ హెచ్ జీ ల్లో ప్రస్తుతం 18- 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,ప్యాక్స్ ఛైర్మెన్ రేగలపాటి కృష్ణదేవరావు,డీఆర్డీఓ శేషాద్రి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వకులభరణం శ్రీనివాస్,పిల్లి కనకయ్య,మాజీ సర్పంచ్లు,ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్



**-బండారు నరసింహారావు...**

**మధిర, నవంబర్21( మన వార్త):**మధిర పి ఎ సి ఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణ ప్రసాద్,తసిల్దార్ ఆర్ రాంబాబు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం దిగుబడి ఎలా ఉంది అని రైతులను అడిగి తెలుసుకున్నారు.. రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కోనుగోలు చేస్తుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు..రైతులకు న్యాయమైన మద్దతు ధర,సమాయానికి కోనుగోలు,పారదర్శక వ్యవస్థ అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు..ఏ గ్రేడ్ రకానికి రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర కల్పిస్తుందని,సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తుందని చెప్పారు..రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..ఈ కార్యక్రమంలో ఏవో కనకం సాయి దీక్షిత్,ఏ ఈ ఓ,అమృత, సొసైటీ సీఈఓ,ఏఎంసి వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి,టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మిర్యాల రమణ గుప్తా, ఏఎంసీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, మధిర సొసైటి ఛైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్ షేక్ షన్ను,వేల్పుల చెంచయ్య, ఆత్మ డైరెక్టర్ గోపాల్ రావు, కర్నాటి రామారావు, కొంగల ప్రసాద్ పత్తేపురపు సంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో లారీలు అందుబాటులో ఉండాలి



**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్...**
**-తంగళ్ళపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో పరిశీలన...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ – 21**రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించేందుకు అవసరమైన లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలంలోని తాడూర్, పాపయ్యపల్లి, ఓబులాపూర్, సారంపల్లి, రాళ్లపేట, కస్బేకట్కూర్, చీర్లవంచ గ్రామాల్లో ఏర్పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శుక్రవారం పరిశీలించారు. ముందుగా ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం, కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయా లని సూచించారు. కనీస వసతులు కల్పించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహ కులను ఆదేశించారు. ధాన్యం తరలించేందుకు కేంద్రాలకు లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్



**మధిర, నవంబర్21( మన వార్త):** సమాజ అభివృద్ధిలో మూఢనమ్మకాల తరిమివేతలో సైన్స్ దే కీలక పాత్ర అని జనవిజ్ఞాన వేదిక మధిర మండలం అధ్యక్ష విజయ్ కుమార్ ప్రధాన కార్యదర్శులుఅజ్మీర రవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మధిర నందు జనవిజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ను మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రగతి కోసం, స్వావలంబన కోసం సైన్స్ పేరుతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పాఠశాల, మండల, జిల్లా రాష్ట్రస్థాయిలలో సైన్స్ సంబరాల నిర్వహిస్తున్నారు అని,విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. నిత్య జీవితంలో సైన్స్ యొక్క ఉపయోగాల గురించి తెలుసుకోవాలని విద్యార్థులకు వివరించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహపూరిత వాతావరణంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నందు పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్ నిర్వహణలో జె వి వి మండల పూర్వ అధ్యక్షులు ధనిశెట్టి భాస్కరరావు మరియూ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మాజీ జెడ్పిటిసి



**నార్సింగి నవంబర్ 21( మన వార్త ప్రతినిధి)**నార్సింగ్ మండలంలోని పదిమంది లబ్ధిదారులు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన పదిమంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పార్టీ మండల అధ్యక్షులు బాబు, మాజీ జెడ్పిటిసి కృష్ణారెడ్డి ల చేతుల మీదుగా సుమారు రెండు లక్షల 87000 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్సింగ్ మండలంలోని పదిమంది లబ్ధిదారులు ఆసుపత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందించేందుకు కృషి చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, నర్సంపల్లి లోని ప్రభుత్వ పాఠశాల కోసం 70 లక్షలు, చిన్న తండా రోడ్డు నిర్మాణం కోసం 30 లక్షలు కేటాయించినట్లు వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, మాజీ ఎంపీటీసీ మల్లేష్ గౌడ్, సుదీప్ గౌడ్, భాషా నాయక్, చత్రియ నాయక్, బిక్యా నాయక్, భూపతి రాజు, నరసింహారావు, ఓం ప్రకాష్ యాదవ్, జీవన్,స్వామి, మహేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ములుగు

# వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి



**ములుగు జిల్లా నవంబర్21 మన వార్త ప్రతినిధి** గోవిందరావుపేట మండల పసర గ్రామంలోని మ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి గారు ఆకస్మిక తనిఖీ చేసి, రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రాలను నడిపే వారు ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని అన్నారు. ఈ సందర్బంగా రేగ కళ్యాణి మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, ధాన్యం విక్రయించాలంటే దళారులను నమ్మి మోసపోవద్దు అని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం విక్రయించాలని కోరారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రవాణా రిజిస్టర్ తనిఖీ చేసి, ఖచ్చితంగా ప్రతి ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రం ధాన్యం యొక్క రవాణా రిజిస్టర్ నిర్వహించాలని కోరారు. అలాగే రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని, రైతుల యొక్క ధాన్యం కొనుగోలును వెంటనే ఆన్లైన్ చేసి టోకెన్ నెంబర్ ఇవ్వాలని, అలాగే ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని అన్నారు. కావున రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, ఎవరైనా రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని, ముఖ్యంగా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే మాత్రం ఊరుకునేది లేదని అన్నారు. ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెట్టే రైతన్నకు మనమంతా అండగా నిలబడి, ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పసర ధాన్యం కొనుగోలు నిర్వాహకులు, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు అందిస్తాం



**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్...**
**-కలెక్టర్ గరిమ అగ్రవాల్ మహిళలకు చీరలు పంపిణీ...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ – 21** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లో అర్హులైన మహిళలందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలు అందజేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. చందుర్తి మండలంలోని మల్యాల గ్రామంలో మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇందిరా మహిళా చీరల ఉత్పత్తి ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సాధికారతకు ఉపయోగపడుతుందని, మహిళల ఆత్మగౌరవానికి తోడ్పడుతుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన మహిళలకు అందజేసే చీరలు జిల్లాలో ఉత్పత్తి కావడం ఎంతో సంతోషంగా ఉందని, 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి సాధ్యమనే ఉద్దేశ్యంతో ప్రతి ప్రభుత్వ పథకంలో వారిని భాగస్వామ్యులను చేస్తుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరిట ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలు, ఇతర వ్యాపారాలకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఎస్ హెచ్ జీ ల్లో ప్రస్తుతం 18- 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని, ఇప్పటిదాకా 117 మందికి రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, ఐదుగురికి రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, తహసీల్దార్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్టిఎఫ్ 80వసంతాల విద్యాసదస్సు పోస్టర్ ను ఆవిష్కరించిన కోనరావుపేట మండల విద్యాధికారి మురళి నాయక్

**-హైదరాబాద్ లో జరిగే 80వసంతాల విద్యాసదస్సును విజయవంతం చేయండి ....**
**-టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్...**




**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ 21**డిసెంబర్ 21వ తేదీన హైదరాబాద్ లో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ 80వసంతాల అభ్యుదయోత్సవ వేడుకల విద్యాసదస్సు పోస్టర్ ను కొనరావుపేట మండల విద్యాధికారి మురళి నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) 1944 లో స్వాతంత్ర పూర్వం నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి ఏర్పడిన ఏర్పడిన సంఘమన్నారు. మొదట ఏపీటిఎఫ్ ఏర్పడిన సంఘం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టిఆర్టిఎఫ్ గా అవతరించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పట్ల ఉద్యమిస్తున్న సంఘం అన్నారు. అనంతరం టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ. నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయుల హక్కుల కొరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తూ 80 సంవత్సరాలు గడిచిన సందర్భంగా డిసెంబర్ 21వ తేదీన హైదరాబాద్ లో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ 80వసంతాల అభ్యుదయోత్సవ వేడుకల విద్యాసదస్సుకు ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై తెలంగాణ రాష్ట్రం టీచర్ ఫెడరేషన్ 80 వసంతాలు రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, మండల విద్యాధికారి మురళి నాయక్ , కాంప్లెక్స్ హెచ్ఎం జ్ఞానేందర్ బాబు, సిఆర్పి రవితేజ, టి ఆర్ టి ఎఫ్ నాయకులు, బడ్డిగం మంగళ, సంధ్యారాణి, వడ్డేపల్లి మాధవి,ఉచ్చిడి సంగీత, మిట్టపల్లి సుమలత, మాడుగుల రేణుక, గంగవరం శ్రీధర్, బి శ్రీనివాస్, గోలి రాధకిషన్, మమత , కవిత, రాజు, రఘుపతి, చందన, ప్రవళిక, మామిడాల రమేష్, గాజెంగి విష్ణు,పోతుగంటి రమేష్, జయ కృష్ణారెడ్డి, అపర్ణ, మహేందర్ రావు, సమీనా బేగం, స్వప్న, మహేష్, సతీష్, రమాకాంత్, శ్రీలత, వెంకటేశం, విజయ, కిరణ్మయి , సంజీవ్, శ్యాంసుందర్, భాస్కర్ రెడ్డి, సురేష్ వీణ, రమ్య శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# చెకుముకి సైన్స్ టెస్ట్ కు విద్యార్థులకు మంచి స్పందన



**-మూడు విభాగాల్లో మూడు పాఠశాలలకు తొలి స్థానాలు...**

**ఇల్లంతకుంట,నవంబర్ 21 (మన వార్త ప్రతినిధి)టీ**ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి విజ్ఞాన పరీక్ష నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్,ఆదర్శ,గురుకుల,బాలికల వసతి పాఠశాలలకు చెందిన 8,9,10వ తరగతి విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు డి.శ్రీహరి మాట్లాడుతూ "శాస్త్రీయ దృక్పథం పెరిగితే మూఢనమ్మకాలు తగ్గి సమాజంలో మంచి మార్పులు వస్తాయి అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ కూడా విజ్ఞానాభివృద్ధిలో జెవివి చేస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ "మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలు తెలుసుకోవాలి. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో శాస్త్రీయ అవగాహన పెంచుతాయి. సందేహాలుంటే గురువులను సంప్రదించాలని" సూచించారు. ఈ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల ఆంగ్ల మాధ్యమం విభాగంలో జడ్పీహెచ్ఎస్ పెద్దలింగాపూర్,ప్రైవేట్ పాఠశాలల ఆంగ్ల మాధ్యమం విభాగంలో కేరళ ఆదర్శ పాఠశాల ఇల్లంతకుంట,ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్ ఆంగ్ల మాధ్యమం విభాగంలో తెలంగాణ ప్రభుత్వ మోడల్ పాఠశాల (టీజీఎంఎస్)రహీంఖాన్ పేటఈ మూడు పాఠశాలలు తొలి స్థానాలు సాధించారు నీ తెలియజేశారు. ఈ విజేతలను ఈ నెల నవంబర్ 28న జరగనున్న జిల్లా స్థాయి చెకుముకి విజ్ఞాన పరీక్షకు పంపనున్నట్లు మండల విద్యాధికారి సి. హెచ్.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ ధృవపత్రాలు,విజేతలకు బహుమతులను స్థానిక ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్,జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ,ఉపాధ్యక్షులు శ్రీహరి,పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు ప్రేమలత,పావని,తిరుపతి అందజేశారు. ఈ కార్యక్రమంలో చెకుముకి విజ్ఞాన పరీక్ష మండల బాధ్యులు వి.మహేష్ చంద్ర,పి. అనిల్ కుమార్,ఉపాధ్యాయులు,వనరుల వ్యక్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ పై దాడి..మంత్రి ఫోన్ చేసి భరోసా...



**ఇల్లంతకుంట,నవంబర్ 21 (మన వార్త ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట సిరిసిల్ల రహదారిలో వల్లంపట్ల గ్రామం వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ఆర్టీసీ డ్రైవర్ పై దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కల్లూరి బాలరాజుపై..ఓ వ్యక్తి "నా కారుకు సైడ్ ఇవ్వలేదంటూ" అమానుషంగా దాడి చేయడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనకు సంబంధించిన వీడియోలు,ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో "మన తండ్రిలాంటి ఆర్టీసీ డ్రైవర్‌ను ఇలా తన్నడం,కొట్టడం ఏంటి..?" అంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని గురువారం సాయంత్రం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డ్రైవర్ బాలరాజుతో ఫోన్‌లో మాట్లాడి,అతని ఆరోగ్యం గురించి ఆరాధీశారు. సంభాషణలో బాలరాజు దుఃఖంతో మాట్లాడుతూ,"సార్ నాకు ఆర్టీసీలో ఇన్ని సంవత్సరాల సీనియార్టీ ఉంది. ఎన్నో అవార్డులు తెచ్చుకున్నాను. నా తప్పు లేకుండా ఇలా దెబ్బలు తినడం చాలా బాధగా ఉంది" అని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బాలరాజుకు ధైర్యం చెప్పి, "నువ్వు భయపడొద్దు నీకు నేను అండగా ఉంటాను. నిందితుడిపై కఠిన చర్యలు తప్పవు" అని భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రజలు కూడా ఏకగ్రీవంగా స్పందిస్తూ,దాడి చేసిన వ్యక్తికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీజాపూర్ ఎక్కితే బిస్తరి కట్టాల్సిందేనా...?

**-ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ,ఇద్దరూ మృతి...**
**-మరో ఐదు మందికి తీవ్ర గాయాలు....**

**చేవెళ్ల నియోజకవర్గం నవంబర్ 21:మన వార్త ప్రతినిధి**హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాంగ్ రూట్లో అతివేగంతో వచ్చిన కారు, మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో 5 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారుడు తాండూరు పట్టణానికి చెందిన వంశీధర్ రెడ్డి (తండ్రి) పాండురంగారెడ్డి వయస్సు (46)వృత్తి వైద్యుడు, శుక్రవారం ఉదయం 7:30 గంటలకు మొయినాబాద్ లోని హైదరాబాద్-బీజాపూర్ రహదారి పక్కన “ఆన్ ది వే” డ్రైవిన్ (పెంటయ్య) హోటల్ ముందు హైదరాబాద్ నుండి చేవెళ్ల వెళ్తున్న **TG07T1203** నెంబర్ కారు రాంగ్ రూట్ లో అతివేగంతో ఫిర్యాదుదారుని హోండా **TS08 FV 8288** కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఫిర్యాదుదారుని అత్తమ్మ సుజాత బంధువు రోజా, డ్రైవర్ వెంకట్ లకు గాయాలయ్యాయి. డ్రైవర్ వెంకట్ కి తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స మేరకు ఉస్మానియా హాస్పిటల్ కి తరలించారు. రాంగ్ రూట్లో వచ్చిన **TG07 T 1203** కారులో ప్రయాణిస్తున్న నలుగురులో కారు డ్రైవర్ కరీం అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన వారిని స్థానిక భాస్కర్ హాస్పిటల్ కు తరలించారు. హాస్పటల్ లో చికిత్స పొందుతూ లోకేష్ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన వారు బాబురావు, అఖిల్, సుజాత, రోజా, స్వల్ప గాయాలతో స్థానిక భాస్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.





# జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు



**చేగుంట నవంబర్ 21( మన వార్త ప్రతినిధి)**జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేగుంట మండల స్థాయి చెకుముకి పోటీలను మండల విద్యాధికారి నీరజ పర్యవేక్షణ నిర్వహించారు పాల్గొన్నారు, ఈ పోటీలలో కృష్ణవేణి హై స్కూల్ విద్యార్థులకు మండల స్థాయి ప్రథమ బహుమతి రావడం జరిగింది, ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి గెలుచుకున్న శ్రీ కృష్ణవేణి హై స్కూల్ విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక నిర్వాహకులు మండల విద్యాధికారి నీరజ చేతుల మీదుగా మెమెంటో సర్టిఫికెట్లను అందజేశారు, ఈనెల 28వ తేదీన మెదక్ లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు శ్రీ కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు సాధించాలని వారు తెలిపారు, విద్యార్థులు మండల స్థాయిలో మొదటి బహుమతి పొందినందుకు చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని పాఠశాల ప్రిన్సిపల్ రేణుక, లింగమూర్తి, డైరెక్టర్ నాగరాజు వైస్ ప్రిన్సిపల్ రెహమాన్,, అకాడమిక్ ఇన్చార్జి నసిర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# అపోలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్



**మధిర, నవంబర్21( మన వార్త):**మధిర లోని అపోలో మెడికల్ షాపు నందు ఈరోజు ఉదయం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా మధిర టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిర్యాల వెంకటరమణ గుప్తా మరియు మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారుగుండ్ల నరసింహమూర్తి హాజరైనారు. అపోలో మెడికల్స్ వారు ఏర్పాటు చేసిన ఉచిత శిబిరంలో మధిర వాసులు అత్యధికంగా పాల్గొని ఉచిత సేవలు వినియోగించుకోవడం జరిగింది. అంతేకాకుండా అపోలో వారి రకరకాల ఉత్పత్తులు డిస్కౌంట్ ధరలకు విక్రయించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అపోలో మేనేజర్ రవీంద్ర రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మురళి, తెలంగాణ క్యాంప్ ఇంచార్జి అనురాగ్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపోలో మెడికల్ 24/7 మెడిసిన్స్ అందుబాటులో ఉంటాయని డిస్కౌంట్ కూడా అందిస్తున్నామని మధిర పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో అపోలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న విద్యార్థిని సన్మానించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి



**రామాయంపేట నవంబర్ 21( మన వార్త (ప్రతినిధి)**రామయంపేట్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆరోవ తరగతి చదువుతున్న హర్షిత్ అనే విద్యార్థికి రెండున్నర లక్షల విలువైన బంగారు ఆభరణాలు దొరికినవి.. దొరికిన వస్తువులు మనవి కావు అని వాటిని ఎంతో నిజాయితీగా తిరిగి ఇచ్చిన విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి హర్షిత్ ను శాలువతో సన్మానించి తన నిజాయితీని అభినందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి దశ నుండి మంచి అలవాట్లు నేర్చుకోవాలని, మనది కానీ వస్తువులను తీసుకోకూడదు అని , శ్రద్ధగా చదువుకొని సమాజంలో మనకంటూ ఒక గుర్తింపు పొందాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, స్వామి, శ్యామ్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హరిజనబస్తీ అంగన్‌వాడీ కేంద్రం పై కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక తనిఖీ



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మన వార్త :** అల్వాల్ హరిజన బస్తీ ప్రాంతం లోని అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవల నాణ్యతను,కేంద్రం పని చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో స్థానిక నాయకులు సాజిద్, అరుణ్, అంజయ్య పాల్గొన్నారు. తనిఖీ సందర్భంగా కార్పొరేటర్ అంగన్‌వాడీ సిబ్బందితో, లబ్ధిదారులతో, స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. కేంద్రం రోజువారీ కార్యకలాపాలను సమీక్షిస్తూ పలు అంశాలను పరిశీలించారు. తనిఖీలో పరిశీలించిన చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వంట, పంపిణీ విధానం అవసరమైన సరుకుల లభ్యత గుడ్లు, పాలు, సప్లిమెంటరీ న్యూట్రిషన్ వంటి వస్తువుల నిల్వలు చిన్నారుల ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాలు మరియు హాజరు స్థితి కేంద్రంలో పాటిస్తున్న ఆరోగ్య, స్వచ్ఛత హాజరు రిజిస్ట్రర్లు,స్టాక్ రికార్డులు, పిల్లల అభివృద్ధి మానిటరింగ్ చార్టులు వంటి దస్త్రాల నిర్వహణ తనిఖీ అనంతరం కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నారులు, గర్భిణీలు, ప్రసూతి స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదనే ఉద్దేశంతో ఈ పరిశీలన చేపట్టినట్లు పేర్కొన్నారు. లోపాలు కనిపించిన చోట వెంటనే సిబ్బందికి తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలు కార్పొరేటర్ చేసిన ఆకస్మిక తనిఖీపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి పర్యవేక్షణలు తరచూ కొనసాగాలని అభ్యర్థించారు.

# సామాజిక సేవలో ముందున్న మల్కాజ్ గిరి ఆర్యవైశ్య సంఘం



**కల్వకుర్తి నవంబర్ 21 మన వార్త ప్రతినిధి**
**-త్రిపురామేశ్వర స్వామి, వీరభద్ర స్వామి లకు వెంకటేష్ గుప్తా ప్రత్యేక పూజలు...**

సామాజిక సేవలో హైదరాబాద్ లోని మల్కాజ్ గిరి ఆర్యవైశ్య సంఘం ముందుందని డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మల్కాజ్ గిరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో త్రిపురమేశ్వర, వీరభద్ర స్వాములను దర్శించుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ మల్కాజ్ గిరి ఆర్యవైశ్య సంఘం విద్య, వైద్య పరంగా నిరుపేదలకు ఆదుకోవడంలో ముందుందన్నారు. అదేవిధంగా ఈ సంఘం చేస్తున్న సామాజిక సేవలు వెలకట్టలేనివని ఆయన అన్నారు. కేవలం ఆర్యవైశ్యులకే కాకుండా ఇతరాత్ర కులాల వారికి కూడా ఈ సంఘం తోడ్పాటు అందిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మల్కాజ్ గిరి అధ్యక్షుడు పాత శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శి అల్లంపల్లి సురేష్ గుప్తా, ట్రెజరర్ డి వై ఎస్ గుప్తా, ఆనంద్, జ్ఞానేశ్వర్, మహిళా సంఘం అధ్యక్షురాలు గీతారాణి గుప్తా, కార్యదర్శి శారద గుప్తా, ట్రెజరర్ ఉమామహేశ్వర గుప్తా, నిర్మల గుప్తా, స్రవంతి గుప్తా తదితరు పాల్గొన్నారు.

# యాప్రాల్‌లో ఫోర్జరీ సంచలనం కిలాడీ లేడీ కుతంత్రం బహిర్గతం




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 21 మన వార్త** : మల్కాజ్గిరి జిల్లా యాప్రాల్ లో ఓ మహిళ భారీ పత్రాల ఫోర్జరీ చేసి తన భర్త పేరుపై ఉన్న విలువైన ఆస్తులు, వాహనాలను అక్రమంగా విక్రయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే దాసరి లక్ష్మి అనే మహిళ, తన భర్త జీవించి ఉండగానే, అతడు చనిపోయాడని తప్పుడు సమాచారం సమర్పించి ఫ్యామిలీ సర్టిఫికేట్ పొందింది. అంతేకాక, భర్త అత్తమామలు కూడా మరణించారని అబద్ధపు వివరాలతో పత్రాలు రూపొందించింది. ఈ తప్పుడు సర్టిఫికేట్లను ఆధారంగా చేసుకుని భర్త పేరుపై ఉన్న స్థలాలు, వాహనాలు సహా పలు ఆస్తులను విక్రయించింది. వాహనాలు కనపడకపోవడంతో మామ రాములు మొదట అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో ప్రారంభమైన విచారణలో అనేక అనుమానాలు తలెత్తడంతో రాములు అల్వాల్ ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఎమ్మార్వో కార్యాలయం చేపట్టిన పరిశీలనలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. దాసరి లక్ష్మి సమర్పించిన మరణ ధృవపత్రాలు, ఫ్యామిలీ సభ్యుల వివరాలు అన్నీ నకిలీ పత్రాలే అని తేలింది. దీనిపై ఎమ్మార్వో స్వయంగా అల్వాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాసరి లక్ష్మి అసలు నా కోడలు కాదు. నా కొడుకుతో అక్రమ సంబంధం పెట్టుకుని, ఆ అవకాశాన్ని వాడుకొని ఈ పత్రాలన్నీ ఫోర్జరీ చేసి ఆస్తులు, వాహనాలు అమ్ముకుంది,అని మామ రాములు ఆరోపించారు. పోలీసులు కేసును నమోదు చేసి,ఫోర్జరీ మోసం తప్పుడు ధృవపత్రాల సృష్టి ఆస్తుల అక్రమ విక్రయం వంటి కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు. ఈ ఘటన యాప్రాల్ పరిధిలో తీవ్ర ఆందోళన కలిగించింది.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ




**మధిర,నవంబర్ 21( మన వార్త):**మధిర శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేయడం జరిగినది. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు మాట్లాడుతూ.... అన్నిదానాలలో కెల్లా అన్నదానం మిన్న అని,అన్నం పరబ్రహ్మ స్వరూపమని ప్రతి ఒక్కరూ పుట్టినరోజు,పెళ్లిరోజుల సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని,అన్నదాతలను ప్రోత్సహించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమలు ఏర్పాటు చేస్తున్న దేవాలయ కమిటీని అభినందించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాచేపల్లి రాము, సముద్రాల పాపారావు, ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, కుంచం కృష్ణారావు, కపిలవాయి జగన్మోహన్ రావు,చారు గుండ్ల నరసింహమూర్తి,కాజా చక్రధర రావు, చెడే రామ కోటేశ్వరరావు, కొప్పు రావూరి తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్



**వేములవాడ టౌన్ నవంబర్ 21 (మన వార్త)**శుక్రవారం రోజున జెడ్పిహెచ్ఎస్ తిప్పాపూర్ లో వేములవాడ రూరల్ మరియు వేములవాడ అర్బన్ మండలాలు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ క్వ్యాస్షన్ పేపర్స్ ను గర్ల్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ బన్నాజీ మరియు హన్మాజీపేట హై స్కూల్ హెచ్ఎం శ్రీకాంత్ రావు మరియు తిప్పాపూర్ హై స్కూల్ హెచ్ఎం రాజారత్నం ఆవిష్కరించారు అనంతరం ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా హై స్కూల్ హెడ్మాస్టర్ రాజారత్నం అధ్యక్షత వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయిలో పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ లో దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపు 140 స్కూళ్లలో 5000 దాదాపు మంది స్టూడెంట్స్ పాల్గొన్నారు ముఖ్యంగా విద్యార్థులలో పాఠశాల స్థాయి నుంచి తాత్విక ఆలోచనలు సృజనాత్మకతను శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించడానికి ఈ చెకుముకి టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుంది విద్యార్థులను ప్రశ్నించే తత్వాన్ని పెంపొందింప చేస్తుంది చెకుముకి అనగా ఆదిమానవుడు నిప్పు కనుక్కునే సందర్భంలో రెండు రాళ్ళను రాపిడికి కురిచేసినప్పుడు చెకుముకి శబ్దంతో నిప్పు కనుగొనడం జరిగింది కాబట్టి చెకుముకి టాలెంట్ టెస్ట్ అనే పేరు పెట్టడం జరిగింది ముఖ్యంగా పాఠశాల స్థాయి నవంబర్ 7 నాడు సివి రామన్ జయంతి పురస్కరించుకొని పాఠశాల స్థాయి చెక్క ముక్క టాలెంట్ టెస్ట్ ను ప్రారంభించడం జరిగిందని మండల స్థాయి నవంబర్ 21 సివి రామన్ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాలు చేయడం జరిగిందని, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని మూఢనమ్మకాలు విడనాడాలని తెలియజేశారు.

## ప్రభుత్వ విప్ ను ఘనంగా సన్మానించిన ట్రాక్టర్స్ యజమానులు




**వేములవాడ నవంబర్ 21 (మన వార్త )**వేములవాడ పట్టణంలోని ఇటీవల నూతనంగా ఎన్నిక కాబడిన శ్రీ రాజరాజేశ్వర ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ వారు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మహాలింగేశ్వర గార్డెన్స్ లో ఘనంగా సన్మానించారు. అనంతరం వేములవాడ పట్టణ చెందిన బిజెపి నాయకులు వేములవాడ ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు సరిపెల్లి కార్తీక్ మరియు లిక్కిడి జితేందర్ ఆధ్వర్యంలో వారి మిత్రబృందం 50 మంది ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాగ వారికి విప్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## అక్కన్నపేటలో అంగన్‌వాడీ కేంద్రం భూమిపూజ



**రామాయంపేట నవంబర్ 21(మన వార్త (ప్రతినిధి)** అక్కన్నపేట గ్రామంలో నూతన అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం, నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం ఎంతో ఉపయోగకరమని స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గాజుల రమేష్, నాయకులు కుమార్ సాగర్, శివ ప్రసాద్, గ్రామ కార్యదర్శి సరిత, వినయ్ సాగర్, ధారం సంతోష్, అల్లాడి వెంకట్, బన్సీ రాథోడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. శిశు పోషణ, గర్భిణీ%-%శిశువుల సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రం కీలకమని వారు పేర్కొన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఝాన్సీ లింగపూర్‌లో ఘనంగా జెండా ఆవిష్కరణ



**రామాయంపేట నవంబర్ 21: (మన వార్త ప్రతినిధి )**రామాయంపేట మండలం ఝాన్సీ లింగపూర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మ దేవస్థానం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలతో కార్యక్రమం ప్రారంభించి సాంప్రదాయ పద్ధతిలో జెండా ఎగురవేశారు. సంఘం అధ్యక్షుడు రామ కిష్టయ్య నేతృత్వంలో గ్రామ పెద్దలు, సంఘ నాయకులు పాల్గొన్నారు. యువత కూడా పెద్ద సంఖ్యలో చేరి కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ముదిరాజ్ సమాజ ఐక్యతే శక్తి అని నాయకులు ఈ సందర్భంగా సందేశం యువతకు చేరవేశారు. సమాజ అభివృద్ధి కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### గ్రామ పాలన కార్యాలయాన్ని ప్రారంభించిన కాలే యాదయ్య, ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



**మొయినాబాద్ నవంబర్ 21:మన వార్త ప్రతినిధి**మొయినాబాద్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన గ్రామ పాలన కార్యాలయ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మరియు గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి. తహసీల్దార్ గౌతమ్ కుమార్ తో కలిసి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నూతన గ్రామ పాలన కార్యాలయం ముందు వేసిన బోరును కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, పట్నం రాంరెడ్డి, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత మార్చ్ ను విజయవంతం చేయాలి..



**జమ్మికుంట, నవంబర్ 21( మన వార్త ప్రతినిధి):**పట్టణములో ఈనెల 25న జరగబోయే ఐక్యత మార్చ్ కు ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కృష్ణా రెడ్డి పిలిపించారు. ఉక్కు మనిషి గా పేరుగాంచిన భారతదేశ తొలి ఉపప్రధాని, హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం జయంతి ఉత్సవాలు సంవత్సరం పాటు నిర్వహించాలనే పిలుపుమేరకు జమ్మికుంట పట్టణంలో ఈనెల 25వ తేదిన ఉదయం 10 గంటలకు నిర్వహించే యూనిట్ మార్చ్ కు ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొని యూనిటీ మార్చ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. జమ్మికుంట పరిసర ప్రాంతాల ప్రజలు మరియు అన్ని వర్గాల ప్రముఖులు పాల్గొని ఐక్యతా మార్చ్ విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, పుప్పాల రఘు, జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట, హుజురాబాద్ అధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, బత్తిని నరేష్ గౌడ్, బైరెడ్డి రమణా రెడ్డి, తుర్పాటి రాజు, కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకుర్, బచ్చు శివన్న, కొండ్లె నగేష్, నిరుపరాణి, కేస స్వరూప, బూరుగుపల్లి రాము, రాచపల్లి ప్రశాంత్, యాంసాని సమ్మయ్య, పొనగంటి రవి, బోనగిరి ప్రణీత్, ఆకుల పోచయ్య, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్ర ముగించుకొని వచ్చిన మనగురు స్వామికి సన్మానాల వెల్లువ



**చేవెళ్ల: నవంబర్ 21 మన వార్త ప్రతినిధి** మన గురు స్వామి మహాపాదయాత్ర నాలుగవ సంవత్సరం విజయవంతంగా ముగించుకొని సన్నిధానానికి చేరుకున్న ఉమాశంకర్ రెడ్డి గురు స్వామికి గత రెండు రోజులుగా వివిధ గ్రామాల నుండి సన్నిధానం గురు స్వాములు, స్వాములు పెద్ద సంఖ్యలో వచ్చి గురుస్వామి యోగక్షేమాలు తెలుసుకొని మహాపాద యాత్ర జరిగిన తీరు వివరాలు తెలుసుకొని గురుస్వామి ఘనంగా సన్మానించి వెళ్తున్నారు. శుక్రవారం రోజు ఉదయాన్నే శంకర్ పల్లి మండలం ఆలంఖాన్ గూడెం సన్నిధానం గురు స్వాములు సాయి కుమార్ రెడ్డి స్వామి, శివ స్వామి, మోక్షిత్ రెడ్డి కన్నె స్వామి, మిగతా సన్నిధానం స్వాములు, సన్ సిటీ పద్మశ్రీ హిల్స్ కాలనీలో ఉన్న వెంకట్రాంరెడ్డి గురుస్వామి సన్నిధానం స్వాములు, కమ్మెట సన్నిధానం గురు స్వామి, శేఖర్ గౌడ్ గురు స్వామి వారి సన్నిధానం స్వాములు, టంగుటూరు నరసింహారెడ్డి గురుస్వామి, సత్తిరెడ్డి గురుస్వామి, రంగారెడ్డి గురు స్వామి, ఎర్న కొట్టాల వినోద్ స్వామి, కుమ్మెర పాండు గురు స్వామి, వారి సన్నిధానం స్వాములు, మల్కాపూర్ జైపాల్ గురుస్వామి, ఇంద్రసేనారెడ్డి స్వామి, శివ గురు స్వామి, శేఖర్ సార్ స్వామి, వారి సన్నిధానం స్వాములు, చందన్ వెల్లి కృష్ణయ్య గురుస్వామి, ఆంజనేయులు గురు స్వామి, మోకిలా కృష్ణా, మోకిలా సన్నిధానం స్వాములు, గురుస్వామి, ప్రొద్దుటూరు శ్రీనివాస్ రెడ్డి గురుస్వామి, మహారాజ్పేట్ మల్లేష్ గురు స్వామి, రావులపల్లి కలాన్ శ్రీరాములు గురుస్వామి, వారి సన్నిధానం గురు స్వాములు, స్వాములు, వెంకటాపూర్ విజయ్ రెడ్డి గురుస్వామి, వారి సన్నిధానం గురు స్వాములు, స్వాములు, పెద్ద మంగళారం వీరారెడ్డి గురు స్వామి వారి సన్నిధానం గురు స్వాములు, స్వాములు, కనకమామిడి అయ్యప్ప దేవాలయం శ్రీ రామ్ రెడ్డి గురుస్వామి వారి సన్నిధానం స్వాములు, గురు స్వాములు, కేతిరెడ్డిపల్లి శ్రీనివాస్ గురు స్వామి, కాశీంభౌలి రాజేందర్ రెడ్డి గురు స్వామి, ముర్షిద్గూడా రాజు గురు స్వామి, ఇలా చాలా సన్నిధానాల గురుస్వాములు స్వాములు ఉమా శంకర్ రెడ్డి గురుస్వామి యోగక్షేమాలు యాత్ర వివరాలు తెలుసుకొని గురుస్వామిని ఘనంగా సత్కరించి వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ రెడ్డి గురుస్వామి మాట్లాడుతూ నాకు. అనుకుంటే మాత్రం అది చాలా తప్పు ఆ విధంగా ఎవరు కూడా చేయవద్దు మరి నియమాలు నిష్ఠల విషయంలో గురుస్వాములు కూడా కొద్దిగా స్వాములను సరియైనదారులు పెట్టే విధంగా ముందుకు నడపాలని గురుస్వాములు అందరికీ పాదాభివందనాలు చేస్తూ ప్రార్థిస్తున్నానని దీక్షా నియమాలను కఠినంగా పాటించే విధంగా ప్రతి సన్నిధానం గురు స్వామి కూడా దీక్ష స్వీకరించే స్వాములకు తప్పనిసరిగా చెప్పవలసిన అవసరం గురుస్వామి పైన పూర్తిగా ఉంటుంది. ఈరోజు చాలాచోట్ల దీక్షా నియమాలను సరిగా పాటించక ఎక్కడపడితే అక్కడ భోజనం చేస్తూ స్వాములు చూసేవారికి చులకనగా మారిపోతున్న ఈ సందర్భంలో గురుస్వాములు అందరూ కొద్దిగా దయచేసి ఎవ్వరి పరిధిలో వారు నియమాలను నిష్టాలను సక్రమంగా పాటించే విధంగా ఈ శ్రీ శ్రీ స్వామివారి దీక్షను ముందుకు తీసుకువెళ్లి హిందూ సమాజంలో భక్తికి ఉన్న శక్తి ఎంతో నిరూపించవలసిన అవసరం అయ్యప్ప స్వాములు అందరిపైనా ఉంటుందని గురుస్వాములు అందరికీ పేరుపేరునా నమస్కరిస్తూ విన్నవిస్తున్నారని ఉమా శంకర్ రెడ్డి గురు స్వామి అన్నారు. మా పాదయాత్ర ముగించుకుని వచ్చిన నన్ను కలిసి నా యోగక్షేమాలు తెలుసుకొని నాపైన మీ అభిమానాన్ని ప్రేమను ఆప్యాయతలను చూపించడం మీ అందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఉమాశంకర్ రెడ్డి గురుస్వామి తెలియజేశారు.

## రుద్రవరంలో ఘనంగా ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్సవ వేడుకలు



**వేములవాడ నవంబర్ 21 (మన వార్త ప్రతినిధి )**ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ అర్బన్ మండలం, రుద్రవరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై, పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నాయకులు మాట్లాడుతూ, ముదిరాజ్ సమాజ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని అందరూ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. మధ్యమనేరు జలాశయం పరిధిలోని మత్స్యకార్మికుల కుటుంబాల ఉపాధిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తక్షణమే ఏటా కోటి చేప పిల్లలను విడుదల చేయాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకార్మికులకు ఏడాదిలో జూలై, ఆగస్టు నెలల్లో ఉపాధి లేక ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని, ఈ కష్టకాలంలో వారికి అండగా ఉండేందుకు ప్రభుత్వం జీవన భృతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మత్స్యకార్మికులకు అవసరమైన వలలు, తెప్పలను ఉచితంగా పంపిణీ చేయాలని, అంతేకాకుండా చేపలను విక్రయించేందుకు రవాణా సౌకర్యం మెరుగుపడటానికి ద్విచక్ర వాహనాలను పంపిణీ చేయాలని వారు సూచించారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రుద్రవరంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే చారిత్రక తెప్పల పోటీలను ఈసారి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, మత్స్యకార్మికుల సంప్రదాయ క్రీడను ప్రోత్సహించాలని ముదిరాజ్ సంఘం నాయకులు మరియు మత్స్యకార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు తునికి శంకర్, ఉపాధ్యక్షులు తునికి ప్రవీణ్, జిల్లా కోర్ కమిటీ సభ్యులు మాజీ ఎంపీటీసీ తునికి మల్లయ్య, మండల అధ్యక్షులు తునికి నరసయ్య, జిల్లా కార్యదర్శి తునికి నరేష్, సభ్యులు సాయిరాం, అజయ్, రాము, రాజు, శంకర్, కనుక రాజు, జనార్ధన్, శ్రీకాంత్, రాజనర్సు, గణేష్, సురేష్, కనకయ్య, నరసయ్య, తునికి స్వామి, సత్యం, మహేష్, పరశురాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మదీనా మసీదులో భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**కల్వకుర్తి నవంబర్ 21 మన వార్త ప్రతినిధి**అచ్చంపేట పట్టణంలో మదీనా మసీదులో 12 లక్షల రూపాయలతో నూతన బిల్డింగ్ భూమి పూజ చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర ఎఐసిసి పరిశీలకులు,అచ్చంపేట శాసనసభ్యులు డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ మీ అందరికీ నా హృదయపూర్వక అస్సలాము అలైకుమ్ ఈ రోజు మనందరికీ చాలా పవిత్రమైన మరియు చారిత్రకమైన రోజు. ఎన్నో ఏళ్లుగా మన మధ్య ఉన్న మదీనా మసీదు నూతన నిర్మాణానికి, పునర్నిర్మాణానికి సంబంధించిన ఈ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం నాకు దక్కిన గొప్ప గౌరవంగాభావిస్తున్నాను. మసీదు కేవలం ప్రార్థనా స్థలం మాత్రమే కాదు. ఇది సామాజిక ఐక్యతకు, సామరస్యానికి మానవత్వానికి ప్రతీక. మనం వేరువేరు మతాలు, వేరువేరు సంస్కృతులు కలిగి ఉండవచ్చు, కానీ మనందరి లక్ష్యం ఒక్కటే శాంతి మరియు సంతోషం. ఈ నూతన మసీదు మనందరి మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందనడంలో సందేహం లేదు. అభివృద్ధిలో భాగస్వామ్యం మన ప్రభుత్వం ఎప్పుడూ అభివృద్ధి మరియు సంక్షేమానికి కట్టుబడి ఉంటుంది. మసీదుల నిర్మాణం, ప్రార్థనా స్థలాల అభివృద్ధి అనేది కేవలం ఒక మతానికి సంబంధించినది కాదు, అది మన ప్రాంత సామాజిక అభివృద్ధిలో ఒక భాగం. అందుకే, ఈ మసీదు నిర్మాణానికి అవసరమైన నిధులు మరియుసహకారాన్ని అందించడంలో నేను ఎప్పుడూముందుంటాను అని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలోపాల్గొన్నఅచ్చంపేట మున్సిపల్ చైర్మెన్ గార్లపాటి శ్రీనివాసులు, మైనారిటీ సోదరులు తదితరులు.

## మృతుని కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం



**-ప్రణవ్ అన్న ఆదేశాలమేరకు.. 50 కిలోల బియ్యం పంపిణీ..**

**కమలాపూర్ నవంబర్ 21 మన వార్త ప్రతినిధి** కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన మౌటం పున్నం చందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మౌటం కుమారస్వామి మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు మృతుల కుటుంబాలకు నిరుపేద కుటుంబాలకు సాయం చేస్తూ అండగ నిలబడుతున్నాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు మౌటం రమేష్, కార్యదర్శిమౌటం నిరంజన్, మాజీ కార్యదర్శి మౌటం శ్రీనివాస్, డైరెక్టర్లు మౌటం కుమారస్వామి, మౌటం లచ్చయ్య, జంగిలి అరుణ్ తదితరులు ఉన్నారు.

## క్వింటాల్ పత్తి గరిష్ఠ ధర 7100 పలికింది..



**జమ్మికుంట,నవంబర్ 21( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తికి శుక్రవారం రూ 7,100 పలికింది. 72 వాహనాలలో 659 క్వింటాల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మోడల్ ధర రూ 6,900, కనిష్ట ధర రూ. 6200 పలికింది. సంచులలో పత్తిని 10 మంది రైతులు 16 క్వింటాలు విక్రయానికి తీసుకొని వచ్చారు. గరిష్ఠ ధర రూ 6,400, మోడల్ ధర రూ 6000,కనిష్ట ధర రూ 5500 కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కొనుగోళ్లను మార్కెట్ చైర్పర్సన్ పుల్లూరి స్వప్నా సదానందం,కార్యదర్శి రాజా పరిశీలించారు. శనివారం, ఆదివారం మార్కెట్ కు వారంతా సెలవులు వున్నట్లు తిరిగి సోమవారం మార్కెట్ లో కొనుగోళ్లు జరుగుతాయని చైర్ పర్సన్ స్వప్నా సదానందం తెలిపారు.

## క్వింటాల్ పత్తి గరిష్ఠ ధర 7100 పలికింది



**జమ్మికుంట,నవంబర్ 21( మన వార్త ప్రతినిధి ):**జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తికి శుక్రవారం రూ 7,100 పలికింది. 72 వాహనాలలో 659 క్వింటాల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మోడల్ ధర రూ 6,900, కనిష్ట ధర రూ. 6200 పలికింది. సంచులలో పత్తిని 10 మంది రైతులు 16 క్వింటాలు విక్రయానికి తీసుకొని వచ్చారు. గరిష్ఠ ధర రూ 6,400, మోడల్ ధర రూ 6000,కనిష్ట ధర రూ 5500 కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కొనుగోళ్లను మార్కెట్ చైర్పర్సన్ పుల్లూరి స్వప్నా సదానందం,కార్యదర్శి రాజా పరిశీలించారు. శనివారం, ఆదివారం మార్కెట్ కు వారంతా సెలవులు వున్నట్లు తిరిగి సోమవారం మార్కెట్ లో కొనుగోళ్లు జరుగుతాయని చైర్ పర్సన్ స్వప్నా సదానందం తెలిపారు.

## చిన్నారులకు పాన్ కార్డ్ తీసుకోండి..



**- పెట్టుబడులపై అవగాహన కల్పించండి...**

**న్యూఢిల్లీ, నవంబర్ 21:**చిన్నప్పటి నుంచే పొదుపు, పెట్టుబడులపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో వారు ఆర్థికంగా బలంగా నిలబడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇదే దిశగా ఇప్పుడు మైనర్లకు కూడా పాన్ కార్డ్ తీసుకునే వెసులుబాటు ఉందని ఆదాయపు పన్ను విభాగం స్పష్టం చేస్తోంది. ఇటీవల చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఒక అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలు స్వయంగా పాన్ కార్డ్‌కు దరఖాస్తు చేయలేరు. వారి తల్లిదండ్రులు లేదా చట్టపరమైన గార్డియన్ వారు ప్రతినిధులుగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండూ మార్గాల్లో పూర్తి చేయవచ్చు. దేశంలో నివసించే పిల్లలతో పాటు ఎన్‌ఆర్‌ఐ పిల్లలకు కూడా పాన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసే అవకాశం ఉంది. మైనర్ పాన్ కార్డ్‌లో పిల్లల ఫోటో, సంతకం ఉండవు. వారు 18 ఏళ్లు పూర్తయ్యాక ఫోటో, సంతకంతో కొత్త కార్డ్ కోసం మళ్లీ అప్లై చేయాలి. అయితే, అప్పటికీ పాన్ నంబర్ మాత్రం మారకుండా అదే కొనసాగుతుంది. చిన్నారులకు పాన్ కార్డ్ ఉండటం వల్ల వారి పేరుతో బ్యాంక్ ఖాతాలు సులభంగా తెరవచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, ఎస్‌ఐపీలు వంటి పెట్టుబడులు చేయడం వీలవుతుంది. అలాగే డీమ్యాట్ ఖాతా ఓపెన్ చేసి వారి పేరుతో షేర్లలో పెట్టుబడి పెట్టొచ్చు. అయితే ఈ అకౌంట్లు పూర్తిగా తల్లిదండ్రులు లేదా గార్డియన్ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. చట్టపరంగా మైనర్లు ట్రేడింగ్, షార్ట్ సెల్లింగ్, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్, కరెన్సీ డెరివేటివ్స్ వంటి పెట్టుబడి లావాదేవీల్లో పాల్గొనలేరు. కానీ లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా షేర్లు కొనుగోలు చేసి పట్టుకోవచ్చు. గార్డియన్ వారు అకౌంట్‌ను ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. పిల్లలు మేజర్ అయిన తర్వాత కొత్త కేవైసీ పూర్తి చేసి అదే అకౌంట్‌ను కొనసాగించుకోవచ్చు. చిన్న వయస్సులోనే పాన్ కార్డు ఉండటం వల్ల పిల్లలకు ఒక ఆర్థిక గుర్తింపు ఏర్పడుతుంది. భవిష్యత్తులో లోన్లు, పెట్టుబడులు, ట్యాక్స్ వ్యవహారాలు సులభం అవుతాయి. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలకు పాన్ కార్డు తీసి, వారికి పెట్టుబడులపై అవగాహన కల్పించడం ఎంతో అవసరం అని నిపుణులు సూచిస్తున్నారు.

## రైతులు నష్టపోతున్నారు న్యాయం చేయండి అంటూ అగ్రికల్చర్ ఆఫీసర్ కు వినతిపత్రం



**కల్వకుర్తి నవంబర్ 21 మన వార్త ప్రతినిధి.**కల్వకుర్తి మండలంలో అగ్రికల్చర్ ఆఫీసర్ ఏ.వో. సురేష్ కుమార్ కి తర్నికల్ రైతుల సమస్యల పైన వినతి పత్రం ఇవ్వడం జరిగింది నెల రోజుల నుండి తర్నికల్ గ్రామంలో ఏఈఓ లేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు అన్లైన్ చేయక వర్షాలకు పంటలు మునిగి పోయి పంటలు నష్టం కావడం అన్లైన్ చేయక పండించిన పంటకు సరైన మద్దత్తు ధర లేక రైతులు నష్ట పోతున్నారు మాకు న్యాయం చేయండి.ఏ.ఈ.ఓ. తొందరగా మాకు సమాకూర్చాలని చాలా ఇబ్బంది పడుతున్నాము అని వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ మండల నాయకులు తాళ్ల సురేష్ గౌడ్ రైతుల పక్షాన మాట్లాడం జరిగింది రైతులు గుండ్య నాయక్, సోమ్లా నాయక్,తొంట వెంకటయ్య, గొడుగు బాలస్వామి ,చాగొండ రాములు, గోపి, వడ్డే యాదయ్య , వడ్డే అంజి , మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.

## టాటా డిజిటల్‌లో భారీగా లేఆఫ్స్




**హైదరాబాద్, నవంబర్ 21:** టాటా గ్రూప్ డిజిటల్ విభాగంలో భారీగా ఉద్యోగ కోతలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల టీసీఎస్‌లో ఉద్యోగాలు తొలగించిన విషయం ఇంకా చర్చ కొనసాగుతుండగానే, ఇప్పుడు టాటా డిజిటల్‌లోనూ లేఆఫ్స్ ప్రారంభమైనట్లు సమాచారం. ముఖ్యంగా ఈ-కామర్స్ విభాగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించిన టాటా న్యూ ప్లాట్‌ఫామ్‌లో పునర్వ్యవస్థీకరణ చేపట్టడంతో అనేక మంది ఉద్యోగాలను కోల్పోయారు. సంస్థ పనితీరును సమీక్షించిన తరువాత, ఖర్చులను తగ్గించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు టాటా యాజమాన్యం భావిస్తోంది. అవసరానికి మించిన సిబ్బందిని తగ్గించి, ముఖ్యమైన విభాగాలపైనే దృష్టి పెట్టాలని నిర్ణయించుకుంది. దీని పరిణామంగా టెక్నాలజీ, మార్కెటింగ్, కస్టమర్ సపోర్ట్‌తో పాటు కొన్ని బ్యాక్ ఎండ్ టీమ్స్‌లో ఉద్యోగ తొలగింపులు జరిగాయి. ఇంకొకవైపు, టాటా న్యూ ప్లాట్‌ఫామ్‌లో 50 శాతం వాటాను బాహ్య పెట్టుబడిదారులకు విక్రయించే యోచనలో సంస్థ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనివల్ల సంస్థకు నగదు ప్రవాహం పెంచడంతో పాటు వ్యాపార విస్తరణకు నిధులు సమకూర్చుకునే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రాలేదు. ఇటీవల గ్లోబల్ మార్కెట్ పరిస్థితులు, టెక్ రంగంలో పడిపోయిన డిమాండ్, ఖర్చుల నియంత్రణ వంటి కారణాలతో అనేక కంపెనీలు ఉద్యోగ కోతలు చేపడుతున్నాయి. టాటా గ్రూప్ వంటి పెద్ద సంస్థలో కూడా ఈ పరిస్థితి రావడం మార్కెట్లో ఆందోళనను రేపుతోంది. రాబోయే రోజుల్లో మరిన్ని విభాగాల్లో కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## మార్కెట్‌లోకి హోండా ఎలివేట్ ఏడీవీ




**హైదరాబాద్, నవంబర్ 21:** హోండా కార్స్ ఇండియా సంస్థ తన సరికొత్త ఎస్‌యూవీ వాహనం 'ఎలివేట్ ఏడీవీ'ను భారత మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. యువతను ఆకట్టుకునేలా స్పోర్టీ లుక్, ఆధునిక డిజైన్‌తో పాటు పలు ఆధునిక ఫీచర్లను ఈ కొత్త వేరియంట్‌లో అందించినట్లు కంపెనీ మార్కెటింగ్ అండ్ సేల్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ తెలిపారు. ఈ ఎలివేట్ ఏడీవీ కారును రెండు వేరియంట్లలో విడుదల చేశారు. హైదరాబాద్‌లో దీని ఎక్స్ షోరూమ్ ధర పదిహేను లక్షల ఇరవై వేల రూపాయల నుంచి పదిహారు లక్షల అరవై ఆరు వేల ఎనిమిది వందల రూపాయల వరకు ఉంది. శక్తివంతమైన ఇంజిన్, మెరుగైన గ్రౌండ్ క్లియరెన్స్, మసిల్ లుక్ బంపర్లు, స్పోర్టీ వీల్స్ వంటి అంశాలు ఈ వేరియంట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలు తమకు అత్యంత కీలక మార్కెట్లుగా మారాయని హోండా పేర్కొంది. మొత్తం అమ్మకాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వాటా దాదాపు ఏడు శాతం వరకు ఉందని వివరించింది. ఈ ప్రాంతాల్లో ఎలివేట్ ఏడీవీకి మంచి స్పందన వస్తుందని కంపెనీ భావ వ్యక్తం చేసింది. అంతేకాదు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 'అల్ఫా ఈవీ' అనే కొత్త విద్యుత్ కారును కూడా భారత మార్కెట్‌లో విడుదల చేయబోతున్నట్లు హోండా ప్రకటించింది. ఈ వాహనానికి సంబంధించిన చార్జింగ్ సౌకర్యాల కోసం ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరుగుతున్నట్లు తెలిపింది. ఈ కొత్త ఈవీ కారును భారత్‌లోనే తయారు చేసి జపాన్‌తో పాటు మరికొన్ని దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు కూడా కంపెనీ స్పష్టం చేసింది. పెట్రోల్, ఎలక్ట్రిక్ వాహనాల రెండింటిలోనూ తమ మార్కెట్ స్థితిని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని హోండా అధికారులు పేర్కొన్నారు. ఎలివేట్ ఏడీవీతో తమ ఎస్‌యూవీ విభాగంలో మంచి పురోగతి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.


# మంధాన పెళ్లి షురూ..



**– హల్దీ వేడుకలో వరల్డ్ ఛాంపియన్స్ హంగామా...**

**పుణె, నవంబర్ 21**భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన వివాహ వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. బాలీవుడ్ సంగీత దర్శకుడు మరియు సింగర్ పలాశ్ ముచ్చల్‌తో ఆరేళ్లుగా కొనసాగుతున్న ప్రేమ బంధం ఇప్పుడు ఏడడుగులతో కొత్త మలుపుకు వెళ్తోంది. వివాహానికి ముందు జరిగే సంప్రదాయ కార్యక్రమాల్లో భాగంగా హల్దీ వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది.పసుపు రంగు వస్త్రధారణలో మెరిసిన స్మృతి మంధాన హల్దీ వేడుకలో ఎంతో ఉల్లాసంగా కనిపించింది. ఈ కార్యక్రమానికి ఆమెతో కలిసి ఆడిన భారత మహిళల వరల్డ్ కప్ విజేతలు కూడా ప్రత్యేకంగా హాజరై సంబురాల్లో పాల్గొన్నారు. షఫాలీ వర్మ, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, రేణుకా సింగ్, రీచా ఘోష్ వంటి స్టార్ క్రికెటర్లు అందరూ పసుపు డ్రెస్ కోడ్‌తో వచ్చి మంధానతో కలిసి డాన్స్ చేస్తూ వేడుకను మరింత రంజుగా మార్చారు.ఇటీవల భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా నుంచి ఆటగాళ్లు అధిక సంఖ్యలో హాజరవ్వడం ఈ హల్దీ వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. వరల్డ్ కప్ గౌరవం సాధించిన వేదికలోనే స్మృతితో కలిసి స్టెప్పులు వేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.నవంబర్ 23న వివాహం జరగనున్నట్లు కుటుంబ వర్గాల సమాచారం. స్మృతి మంధాన క్రికెట్‌తో పాటు వ్యక్తిగత జీవితంలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతుండటంతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# హాకీ క్రీడాకారిణిపై లైంగిక వేధింపులు..




**– విచారణకు ఆదేశించిన కేంద్ర క్రీడామంత్రి...**

**న్యూఢిల్లీ, నవంబర్ 21:** ఎఫ్ఐహెచ్ మహిళల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌కు సిద్ధమవుతున్న వేళ భారత జూనియర్ హాకీ జట్టులో సంచలన ఘటన వెలుగు చూసింది. జట్టు కోచ్ ఒక క్రీడాకారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణలు కేంద్ర క్రీడా శాఖ దృష్టికి రావడంతో మంత్రి మన్సూఖ్ మాండవీయ వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆయన, పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి నిజాలు వెలికితీయాలని అధికారులను ఆదేశించారు.ఈ ఏడాది భారత మహిళల జూనియర్ హాకీ జట్టు అర్జెంటీనా, బెల్జియం, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పలు టూర్లలో పాల్గొంది. ఆ పర్యటనల సమయంలోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా సమాచారం అందినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం చాలా రోజులైనా ఎవ్వరూ అధికారికంగా ఫిర్యాదు చేయకపోవడంతో ఆలస్యంగా ఇది కేంద్ర మంత్రిత్వ శాఖకు చేరిందని అధికారులు చెబుతున్నారు.
ఈ కేసును పరిశీలిస్తున్న అధికారులు లైంగిక వేధింపుల నివారణ చట్టం ప్రకారం బాధితురాలు, కోచ్, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తి గోప్యతతో ఉంచనున్నట్లు తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి ఊహాగానాలకు తావివ్వబోమని, నిజాలు నిర్ధారించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ విషయంపై హాకీ ఇండియా స్పందిస్తూ తమకు ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని తెలిపింది. కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి విచారణ బృందం సంప్రదించిన తర్వాత తమ వాదనను వెలిబుచ్చుతామని పేర్కొంది. హాకీ ఇండియా ప్రధాన కార్యదర్శి భోళానాథ్ సింగ్ ఈ ఘటన తనకు తెలియదని, దర్యాప్తు పూర్తయ్యే వరకు తాము వ్యాఖ్యానించబోమని స్పష్టం చేశారు.ఇదే సమయంలో ఎఫ్ఐహెచ్ మహిళల జూనియర్ హాకీ వరల్డ్ కప్ పోటీలు చిలీలోని సాంటియాగో నగరంలో డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. జట్టు ఇప్పటికే టోర్నీకి సిద్ధమవుతుండగా, ఈ ఆరోపణలు హాకీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. విచారణ నివేదిక వచ్చిన తర్వాత ఈ అంశంపై మరింత స్పష్టత రానుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# వరల్డ్ కప్ గెలిచిన మైదానంలోనే స్మృతి మంధానకు ప్రేమ ప్రపోజల్



**ముంబై, నవంబర్ 21:**భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు జీవితంలో మరిచిపోలేని క్షణం దక్కింది. ఆమె చిరకాల ప్రియుడు పలాశ్ ముచ్చల్ తన ప్రేమను వ్యక్తం చేయడానికి ప్రత్యేకంగా వరల్డ్ కప్ గెలిచిన మైదానాన్నే ఎంచుకున్నాడు. ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో ఈ హృద్యమైన సంఘటన జరిగింది.స్మృతిని ముందుగా ఏం జరుగుతుందో తెలియకుండా కళ్లకు గంతలు కట్టి స్టేడియంలోకి తీసుకొచ్చాడు పలాశ్. అక్కడికి చేరుకున్న తర్వాత స్టేడియం వేదికపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్నివేశం చూసి స్మృతి ఆశ్చర్యానికి లోనైంది. అనంతరం పలాశ్ మోకాళ్లపై కూర్చుని ఆమెకు ఉంగరం అందిస్తూ ప్రేమను వ్యక్తం చేశాడు. ఆ ఒక్క క్షణం స్మృతికి భావోద్వేగంగా మారింది. వెంటనే ఆమె ఆ ప్రపోజల్‌ను అంగీకరించడంతో ఇద్దరూ ఉంగరాలు మార్చుకున్నారు.భారత మహిళా జట్టు వరల్డ్ కప్ గెలిచి చరిత్ర సృష్టించిన అదే మైదానంలో ఈ మధుర క్షణం జరగడం స్మృతి జీవితానికి మరింత ప్రత్యేకతను తీసుకువచ్చింది. పలాశ్ ఈ వీడియోను తన సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అది క్షణాల్లోనే వైరల్‌గా మారింది. లక్షల సంఖ్యలో అభిమానులు స్పందిస్తూ ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు, సినీ ప్రముఖులు కూడా ఈ ప్రేమ జంటకు తమ అభినందనలు తెలియజేస్తున్నారు. వరల్డ్ కప్ విజయంతో ఒక్క ఏడాది ఆనందం, ప్రేమతో మరో జీవితకాల ఆనందం స్మృతికి కలసివచ్చాయని అభిమానులు కామెంట్లలో పేర్కొంటున్నారు.త్వరలోనే వీరి వివాహం జరగనున్నట్లు సమాచారం. స్మృతి మంధాన అభిమానులు ఈ వార్తతో డబుల్ ఖుషీగా ఉన్నారు.

# తొలి రోజే కూలిన 19 వికెట్లు..




**– ఆస్ట్రేలియా 123/9**

**పెర్త్, నవంబర్ 21:** ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య పెర్త్‌లో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ తొలి రోజే అభిమానులకు గూస్‌బంప్స్ ఇచ్చింది. బౌలర్ల హవాతో మ్యాచ్ మొత్తం ఊగిసలాడింది. తొలి రోజు ముగిసేసరికి ఏకంగా పంతొమ్మిది వికెట్లు కూలడం మ్యాచ్ ఆసక్తిని రెట్టింపు చేసింది.టాస్ గెలిచిన ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ చెలరేగిపోవడంతో వారి బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. ఇంగ్లండ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేవలం 172 పరుగులకే ఆలౌటైంది. స్టార్క్ ఒక్కడే ఏడు వికెట్లు తీసి ఇంగ్లండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. అతను 58 పరుగులకే ఈ అద్భుత ప్రదర్శన చేయడం విశేషంగా మారింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ ఒక్కడే అర్ధ శతకం సాధించాడు. ఓలీ పోప్, జేమీ స్మిత్ కొద్దిసేపు నిలబడినా స్టార్క్ ధాటికి ఎక్కువసేపు తట్టుకోలేకపోయారు.తర్వాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా కూడా ఇంగ్లండ్ బౌలింగ్ ముందు తడబడింది. జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ దూకుడుగా బౌలింగ్ చేయడంతో ఆసీస్ బ్యాటర్లు తరచుగా క్రీజ్ వదిలారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 123 పరుగులకు 9 వికెట్లు కోల్పోయింది. ఇంకా 49 పరుగులు వెనుకబడి ఉంది.ఇంగ్లండ్ తరఫున బెన్ స్టోక్స్ ఐదు వికెట్లు తీసి ఆసీస్ బ్యాటింగ్‌ను కుదిపేశాడు. టెస్టు కెరీర్‌లో ఇది అతనికి ఆరోసారి ఐదు వికెట్లు తీయడం కాగా, ఆస్ట్రేలియాపై మూడోసారి ఈ ఘనత సాధించాడు. జోఫ్రా ఆర్చర్ కూడా కీలక వికెట్లు తీసి ఆసీస్ ఒత్తిడిని పెంచాడు.ఇంగ్లండ్ బ్యాటింగ్‌లో హ్యారీ బ్రూక్ 52, ఓలీ పోప్ 46, బెన్ డకెట్ 21, జేమీ స్మిత్ 33 పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బ్యాటర్లలో అలెక్స్ క్యారీ 26, కెమరూన్ గ్రీన్ 24, ట్రావిస్ హెడ్ 21, స్టీవ్ స్మిత్ 17 పరుగులతో స్కోరు చేశారు.మొత్తానికి యాషెస్ సిరీస్‌లో భాగంగా జరుగుతున్న ఈ పెర్త్ టెస్టులో తొలి రోజే 19 వికెట్లు పడటం క్రికెట్ అభిమానులకు అరుదైన అనుభూతిని ఇచ్చింది. రెండో రోజు ఆట ఎలా సాగుతుందో అనే ఆసక్తి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా నెలకొంది.


## ఎన్టీఆర్-త్రివిక్రమ్ కొత్త సినిమా...



**- స్టార్ హీరో ఎంట్రీతో ఫ్యాన్స్ ఆందోళన!**

**హైదరాబాద్, నవంబర్ 21,**యంగ్ టైగర్ ఎన్టీఆర్ పేరు విన్నా చాలు బాక్సాఫీస్ వాతావరణమే మారిపోతుంది. ఇటీవల విడుదలైన 'దేవర'తో పాన్ ఇండియా స్థాయిలో ఏకంగా రూ.500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి తన రేంజ్‌ను మరోసారి నిరూపించాడు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ యాక్షన్ సినిమాతో బిజీగా ఉన్న ఎన్టీఆర్, ఆ ప్రాజెక్ట్ తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఓ భారీ పాన్ ఇండియా మూవీ చేయనున్నాడనే వార్తలు ఇప్పటికే పెద్ద హైప్‌ను క్రియేట్ చేస్తున్నాయి.భారతీయ మైథాలజీ నేపథ్యంతో ఈ సినిమా తెరకెక్కనుందని నిర్మాత నాగ వంశీ ముందే వెల్లడించారు. దీంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్‌లో ఉత్కంఠ మరింత పెరిగింది. అయితే తాజాగా ఈ సినిమాపై ఓ క్రేజీ రూమర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో ఎన్టీఆర్‌తో పాటు మరో స్టార్ హీరో కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నాడన్న వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది.ఆ కీలక పాత్ర కోసం 'కాంతార' ఫేం కన్నడ స్టార్ రిషబ్ శెట్టిని త్రివిక్రమ్ సంప్రదించాడన్న టాక్ బలంగా వినిపిస్తోంది. పాత్ర స్క్రీన్ టైమ్ తక్కువగా ఉన్నా, కథలో మాత్రం చాలా ప్రాముఖ్యత ఉండబోతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రిషబ్ శెట్టి, ఎన్టీఆర్‌కు మంచి స్నేహితుడిగా ఉండటం ఈ గుసగుసలకు మరింత బలం ఇస్తోంది.అయితే ఈ వార్తలపై ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "ఎన్టీఆర్ సినిమా అంటే ఆయనకే పూర్తి ఫోకస్ ఉండాలి. మరో స్టార్ హీరో ఉంటే స్క్రీన్ స్పేస్, హైప్ రెండూ డైల్యూట్ అవుతాయి" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. ఎన్టీఆర్ సినిమా అంటే ప్యూర్ సింగిల్ హీరో షోగా ఉండాలని చాలా మంది అభిమానులు కోరుకుంటున్నారు.ఇప్పటివరకు ఈ రూమర్లపై ఎన్టీఆర్, త్రివిక్రమ్ లేదా నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటం గమనార్హం. రిషబ్ శెట్టి ఎంట్రీ ఉంటుందా లేదా అన్నది అధికారిక ప్రకటన వస్తేనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఐబొమ్మ రవిపై 5 కేసులు నమోదు..






**- కస్టడీలో విచారిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు..**

**హైదరాబాద్, నవంబర్ 21,**టాలీవుడ్ సినిమా పైరసీ వ్యవహారంలో కీలకంగా మారిన ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవిపై హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. అతనిపై మొత్తం ఐదు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసుల సంబంధంగా ఐబొమ్మ రవిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ప్రస్తుతం ఐదు రోజుల కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు.పోలీసుల సమాచారం ప్రకారం, పైరసీ సెల్ ఇచ్చిన ఫిర్యాదుతో ఒక కేసు నమోదు కాగా, బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ అంశానికి సంబంధించిన మరో కేసు కూడా నమోదైంది. అదేవిధంగా పలువురు సినీ దర్శకులు, నిర్మాతలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మరికొన్ని కేసులు నమోదు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ ఐదు కేసులపై దర్యాప్తును సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేకంగా చేపట్టింది.కస్టడీ రెండో రోజున విచారణను మరింత వేగవంతం చేసిన పోలీసులు, ఈ పైరసీ నెట్‌వర్క్ వెనుక ఎవరెవరు ఉన్నారు, రవికి సాంకేతికంగా ఎవరు సహకరించారు, వెబ్‌సైట్ నిర్వహణ, సినిమాల అక్రమ అప్‌లోడ్ వెనుక ఎలాంటి వ్యవస్థ ఉందనే అంశాలపై లోతుగా ప్రశ్నిస్తున్నారు. అతను ఒక్కడే ఈ వ్యవహారం నడిపాడా..? లేక గ్రూప్‌గా పనిచేశారా..? అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.ఈ విచారణలో వచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుని మరికొంతమందిని కూడా విచారణకు పిలిచే అవకాశం ఉందని పోలీసు వర్గాలు సూచిస్తున్నాయి. టాలీవుడ్‌పై గణనీయమైన ఆర్థిక నష్టాన్ని కలిగించిన పైరసీపై ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని సైబర్ క్రైమ్ అధికారులు స్పష్టం చేశారు.

## బెట్టింగ్ యాప్ కేసు.. విచారణకు హాజరైన నిధి అగర్వాల్, శ్రీ ముఖి





**హైదరాబాద్, నవంబర్ 21,** తెలంగాణ రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై నమోదైన కేసును సీఐడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో భాగంగా ఇప్పటికే పలువురు ప్రముఖ సెలబ్రిటీలను విచారించిన సిట్ అధికారులు తాజాగా నటి నిధి అగర్వాల్, యాంకర్ శ్రీముఖి, నటి అమృతా చౌదరిలను విచారణకు పిలిపించారు. శుక్రవారం వారు సీఐడీ కార్యాలయానికి హాజరై అధికారుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.ఇంతకు ముందు ఈ కేసులో విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, రానా తదితర ప్రముఖులను కూడా విచారించిన విషయం తెలిసిందే. బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా మరియు ఇతర వాణిజ్య ప్రకటనల ద్వారా ప్రమోట్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంల్లో యాప్‌ల ప్రమోటర్ల పాత్ర, వారికి చెల్లించిన పారితోషికం, ప్రకటన ఒప్పందాల వివరాలపై లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది.శ్రీముఖి విచారణ పూర్తయినట్లు అధికారులు వెల్లడించగా, నిధి అగర్వాల్, అమృతా చౌదరిలను ఇంకా ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగా బెట్టింగ్ యాప్ నిర్వాహకులు, ప్రముఖ ప్రచారకుల మధ్య జరిగిన లావాదేవీలపై కీలక సమాచారం సేకరించినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. బెట్టింగ్ యాప్‌ల వల్ల యువత తప్పుదారి పడుతోందని, ఆర్థిక నష్టాలు పెరుగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అందువల్ల ఈ కేసును పూర్తిగా క్లియర్ చేసే వరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశాయి.

## బిగ్‌బాస్ తెలుగు 9లో నామినేషన్ల టెన్షన్..



**-ఎలిమినేషన్ రేసులో దివ్య, విన్నర్ రేసులో కళ్యాణ్...**

**హైదరాబాద్, నవంబర్ 21:** బిగ్‌బాస్ తెలుగు తొమ్మిదో సీజన్‌లో ఈ వారం నామినేషన్ల చుట్టూ భారీ ఉత్కంఠ నెలకొంది. కెప్టెన్ తనూజ, ఆమె సేవ్ చేసిన రీతు చౌదరి తప్ప మిగిలిన హౌస్ సభ్యులంతా నామినేషన్లలో చోటు దక్కించుకున్నారు. మరోవైపు సుమన్ శెట్టిని ఎవ్వరూ నామినేట్ చేయకపోవడం కూడా ఈ వారం ప్రత్యేకతగా మారింది. దీంతో మొత్తం ఆరు మంది ఈ వారం ఎలిమినేషన్ రేసులో ఉన్నారు.ఈ వారం నామినేషన్లలో ఉన్నవారు – భరణి, ఇమ్మాన్యుయెల్, సంజన, దివ్య, కళ్యాణ్, డీమన్ పవన్. ఫ్యామిలీ వారాంతం కావడంతో పెద్దగా టాస్కులు జరగకపోయినా, కుటుంబ సభ్యుల రాకతో హౌస్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ప్రతి కంటెస్టెంట్ ఆట, వ్యూహం, ప్రవర్తన గురించి వారి కుటుంబసభ్యులు ఓపెన్‌గా మాట్లాడారు. దీంతో కొంతమందిలో మార్పు కనిపించింది.బయట జరుగుతున్న ఓటింగ్ ధోరణి ప్రకారం%ొ% ఈ వారం కళ్యాణ్‌కు ఎక్కువ మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది. అతడు సేఫ్ జోన్‌లోనే కాకుండా విన్నర్ రేసులో కూడా బలంగా ముందుకు సాగుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇమ్మాన్యుయెల్, భరణి, డీమన్ పవన్ కూడా బలమైన ఓట్లు సాధిస్తున్నారు. అయితే సంజన మరియు దివ్య డేంజర్ జోన్‌లో ఉన్నట్లు ప్రేక్షక వర్గాల్లో చర్చ నడుస్తోందిప్రత్యేకంగా దివ్య ఆటపై సరైన దృష్టి లేకపోవడం, హౌస్‌లో అవసరం లేని డ్రామాపై ఎక్కువగా ఫోకస్ చేయడం, భరణిపై చూపిస్తున్న ఓవర్ పొజెసివ్ ప్రవర్తన%ొ% ప్రేక్షకులకు అసహనాన్ని కలిగిస్తోందన్న అభిప్రాయాలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. అందువల్ల ఈ వారం ఆమె ఎలిమినేషన్‌కు ఎక్కువ అవకాశాలున్నాయని టాక్ బలంగా ఉంది. అయితే అధికారిక ఫలితం మాత్రం ఆదివారం ఎపిసోడ్‌లోనే తేలనుందిఇంతకుముందు వరకు విన్నర్ రేసు తనూజ – ఇమ్మాన్యుయెల్ మధ్యే సాగుతుందని అంచనాలుండగా ఇప్పుడు కామనర్‌గా వచ్చిన కళ్యాణ్ ఊహించని రీతిలో రేసులో ముందుకొచ్చాడు. ముఖ్యంగా సాధారణ ప్రేక్షకుల నుంచి అతడికి బలమైన మద్దతు లభిస్తోంది.బిగ్‌బాస్ హౌస్‌లో ఇప్పుడు పరిస్థితులు రోజు రోజుకీ మారుతున్న వేళ%ొ% ఈ వారం ఎలిమినేషన్ ఎవరి ఖాతాలో పడుతుందో అన్నదే ప్రేక్షకుల్లో ప్రధాన ఆసక్తిగా మారింది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com